క్లుప్తంగా

ఆలయ ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు ఆహ్వానం

షాబాద్: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీలోపు ఆసక్తి కలిగినవారు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం (హైదరాబాద్)లో తమ దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ ఫోన్ నెంబర్ 919396451009ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొర్ర రవి కుమార్తెలు ప్రియాంక, ప్రతిభ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రియాంక నీట్‌లో మెడికల్ సీటును సాధించగా, ప్రతిభ కేరళలో ఎన్ఐటీలో ఇంజినీరింగ్ సీటును సాధించారు. చదువులో మంచి ప్రతిభతో సీట్లు సాధించినందుకు ఎమ్మెల్యే విద్యార్థినులను అభినందించారు. భవిష్యత్‌లో కష్టపడి మరిన్ని విజయాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా బోనాలు



పెద్దఅంబర్‌పేటలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని పెద్దఅంబర్‌పేట, కుంట్లూర్, తట్టిఅన్నారం, పసుమాముల గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మహిళలు గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద అంబర్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం కోసం కలిసి రావాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా, కాలనీవాసులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డిని వారు సత్కరించారు. అనంతరం విద్యానగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో కరెంట్‌లో ఓల్టేజీ ఉన్నందున అదనంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, కృష్ణతాగునీటి పైప్‌లైన్ పనులను సత్వరమే పూర్తిచేయించాలన్నారు. కాలనీలో సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మించాలని, కాలనీకి కమ్యూనిటీహాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికోసం అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో జూనియర్ కళాశాల భవనం పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తీరుస్తామని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల భవనాలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ సంక్షేమసంఘం ఉపాధ్యక్షుడు వర్కాల శేఖర్, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు పర్వతాలు, నాయకులు మెకానిక్ బాబా, తల్లోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మాడ్గుల: అప్పారెడ్డి గ్రామపంచాయతీకి చెందిన మహేందర్ ఇటీవల అగ్నిప్రమాదంలో గాయాలవ్వడంతో కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మహేందర్‌ను పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ. 5వేలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి రూ. 5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో రామచంద్రాపూర్ పాఠశాల భవనం



రావిర్యాల పాఠశాల భవన దుస్థితి

భయపెడుతున్న 'బడి'

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు
- పెచ్చులూడుతున్న పైకప్పులు
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చుతున్నాం.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం అంటూ నాయకులు ప్రసంగాలు చేస్తుంటారు. కానీ అది ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన భవనాల్లో బిక్కుబిక్కుమంటూ పాఠాలు వింటున్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే భయపడుతున్నారు. ఇదీ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.

మౌలిక వసతులు కరువు..

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పాటు కనీసం పాఠశాల భవనాలు, విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు కూడా సరిగా లేకపోవడం బాధాకరం. కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 2 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2వేలపైనే విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 28 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 2300 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఎప్పుడు కూలిపడతాయో..

మండలంలోని చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపడతాయో అనే చందంగా మారాయి. కొందుర్గు మండలంలోని బైరంపల్లి, రామచంద్రాపూర్, లాలపేట, ఆగిర్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్, ఎల్కగూడ, తూంపల్లి, పద్మారం, పీర్జాపూర్, గుంజల్‌పహాడ్, చలివేంద్రంపల్లి, వీరసముద్రం పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. రామచంద్రాపూర్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షం పడిన సమయంలో ఈ పాఠశాలను మూసివేసి పక్క గ్రామమైన పులుసుమామిడి పాఠశాల భవనంలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. మూడురోజుల క్రితం రావిర్యాల పాఠశాల భవనంలో విద్యార్థులు చదువుకుంటుండగానే పాఠశాల ముందు భాగంలో రేలింగ్‌పై ఉన్న జాతీయ జెండా దిమ్మె కూలిపడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇక తంగెళ్లపల్లి దళితవాడ, రాంజాతండా పాఠశాలలకు భవనాలే లేవు.

ఉపాధ్యాయులు లేరు..

ఇక భవనాల పరిస్థితి ఇలా ఉంటే ఉపాధ్యాయుల పరిస్థితి మరీ దారుణం. కొందుర్గు మండలం రామన్నగడ్డ తండా, తంగెళ్లపల్లి దళితవాడ, జిల్లేడ్ చౌదరిగూడ మండలం దామరగిద్ద తండా, వేపకుచ్చతండా, చౌదరిగూడ ఉర్దూ మీడియం, నంద్యాతండా, లక్ష్మీదేవునిపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేరు. ఇక లాలపేట, పుల్లప్పగూడ, కాస్లాబాద్, బోయగూడ, చలివేంద్రపల్లి, చెన్నారెడ్డిగూడ, గోవులబండ తండా, ముష్టిపల్లి, రంజాతండా, వీరసముద్రం పాఠశాలల్లో కేవలం సింగిల్ టీచర్‌తో విద్యాబోధన సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలకు మరమ్మతులు చేసి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు సరైన విద్యాబోధన అందేందుకు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాములు వస్తున్నాయి



మా పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలిపడుతుందో అనే భయంతో చదువుకుంటున్నాం. పక్కనే ఓ భవనం కూలిపడటంతో అందులో నుంచి పాములు వస్తున్నాయి. కూలిన భవనం శిథిలాలను కూడా తొలగించడం లేదు.

–సమీర్, విద్యార్థి, రామచంద్రాపూర్

అధికారులకు తెలిపాం



పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయం ఇదివరకే పలుమార్లు అధికారులకు తెలిపాం. ఇటీవల కురిసిన వర్షాలకు మా పాఠశాలను పక్క గ్రామమైన పులుసుమామిడి పాఠశాల భవనంలోకి మార్చాం. వర్షాలు కాస్తా తగ్గాక మళ్లీ మా పాఠశాల భవనంలోకి వచ్చాం. ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి.

–రాములమ్మ హెచ్ఎం, యూపీఎస్, రామచంద్రాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాం



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పాఠశాలల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీ ల్లో చాలామంది బదిలీపై వెళ్ల డం ఇబ్బందిగా మారింది. ఇంకా బదిలీ అయిన ఉపాధ్యాయులను కూడా రిలీవర్ వచ్చేవరకు పంపించడం లేదు. భవనాల పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

–కిష్టారెడ్డి, ఎంఈఓ, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ

దర్గాను అభివృద్ధి చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మైనార్టీల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: మూడువందల సంవత్సరాల చరిత్ర కలిగిన దర్గాను అభివృద్ధి చేయాలని కోరుతూ మైనార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ సమీపంలోని బూగూడెం(బీబీగేడ) దర్గాను అభివృద్ధి చేయాలని సంతాపూర్ ముస్లిం వెల్ఫేర్ జామామజీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంతాపూర్ సమీపంలో ఎంతో ప్రసిద్ధి చెందిన దర్గా ఉందని, ఈ దర్గాలో గత మూడు వందల సంవత్సరాల నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ దర్గాలో ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో పీర్లపండగ ముందు ఉర్సేషరీఫ్ ఉత్సవాలు జరుగుతాయని, ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని తెలిపారు. అతిపురాతనమైన ఈ దర్గా అభివృద్ధికి నోచుకోలేదని, ఇక్కడ రోడ్డు, విద్యుత్, నీటివసతి వంటి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భక్తుల సౌకర్యార్థం దర్గాలో అన్ని వసతులను కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు జమీల్‌అహ్మద్, ఉపాధ్యక్షుడు రఫిక్‌అహ్మద్, రజాక్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్



నూతన కమిటీ విద్యార్థులతో నాయకులు

చేవెళ్ల: హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. మండలంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా హాస్టల్ విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టల్ విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వేసిన నూతన కమిటీలలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా హరిచరణ్, కార్యదర్శిగా విశాల్, బీసీ హాస్టల్ అధ్యక్షుడిగా ఆదిత్య, కార్యదర్శిగా సందీప్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చందు, భాష, హరిప్రసాద్, రామ్‌చరణ్, నితిన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో నివాసముండే లెప్రసీ బాధితులకు చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజయేందర్‌రెడ్డి హాజరై 100 మంది బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నాగళ్ల మల్కన్న, స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రోత్సహించడం అభినందనీయమని అమ్డాపూర్ పాఠశాల హెచ్ఎం రేణుక అన్నారు. ఆదివారం నగరంలో జరిగిన సాఫ్ట్‌వేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పైచదువుల కోసం విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. విద్యను ప్రోత్సహించడానికి పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఇంటర్ విద్యకు ప్రతి సంవత్సరం రూ.25వేల రూపాయల చొప్పున అందజేస్తారని హెచ్ఎం తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల అమ్డాపూర్, మొయినాబాద్ మండల విద్యార్థినులు టి. శ్రీనిధి, యం.సౌజన్య, కె.స్పూర్తిలకు స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవళీగోపికృష్ణారెడ్డి, ఏపీసీ చైర్మన్ అశ్వినీ, మాజీ పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, వడ్ల నర్సింహచారి, ఉపాధ్యాయులు సత్యానారాయణరెడ్డి, సౌభాగ్యలక్ష్మి, గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురధీర్

చేవెళ్ల: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకొని ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీని అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57మెమో ఆధారంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. మోడల్ స్కూల్‌లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీగా చెప్పిన సీపీఎస్ విధానం రద్దుచేసి ఆర్థిక భద్రతతో కుడిన పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 2003–2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని అల్లవాడ రాజ్యలక్ష్మి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవై ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చేర్పిన ఉపాధ్యాయులను వేదికపై పిలిచి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, బద్రన్న, ఆయూబ్‌ఖాన్, రాంచందర్, సునీత, శిరీశ్, విద్యార్థులు వడ్ల సుమన్‌చారి, గోవుల అంజయ్య, శశికాంత్‌రెడ్డి, నర్సింహా, శేఖర్, అఫ్సార్, కర్ణాకర్, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశ్, సుమలత, అనిత, అనురాధ, అండాలు, భారతీ తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రార్థన మందిరాన్ని తొలగించాలి

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్



పట్టణ సీఐ విజయకుమార్‌ను కలిసిన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అన్యమత ప్రార్థనలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఒక మతానికి చెందినవారు ప్రార్థన మందిరాన్ని నిర్మించారన్నారు. అక్రమంగా నిర్మించిన ప్రార్థన మందిరంలో అన్యమతస్తులు ప్రార్థనలు చేస్తున్నారని, గతంలో అక్రమ నిర్మాణం, అన్యమత ప్రచారంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారిని అడ్డుకున్నారని తెలిపారు. ఇలాంటి అన్యమత ప్రార్థనలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. హిందూ సమాజాన్ని దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ప్రార్థన మందిరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా నాయకుడు విఠ్యాల నర్సింలు, భజరంగ్‌దళ్ సభ్యులు ప్యాట వంశీ, వినయ్, రుషికేశ్, శ్రవణ్, సందీప్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



నూతన కమిటీతో నాయకుడు అల్లి దేవేందర్, కార్మికులు

చేవెళ్ల: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కార్మికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రమాదానికి గురైన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి లేబర్ కార్డులను అందించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా చక్రి, 15 మంది సభ్యులతో కమిటీని ప్రకటించారు. లేబర్ కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్న వారికి అండగా సీఐటీయూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు ఉన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలతో స్పాన్సర్ సీతారాంరెడ్డి

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సందీప్ సిరి జట్టు నిలిచింది. గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం ఆరు జట్లు పాల్గొనగా సందీప్ సిరి, జేసీబీ జగన్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఆదివారం హోరాహోరీగా జరిగింది. ఇందులో సందీప్ సిరి జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టుకు టోర్నమెంట్ స్పాన్సర్ సీతారాంరెడ్డి చేతులమీదుగా రూ.20 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన జేసీబీ జగన్ జట్టుకు రూ.10 వేలు నగదు, ట్రోఫీ అందజేశారు. అదే విధంగా టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచిన బేగరి వినోద్‌కుమార్, బెస్ట్ బౌలర్‌గా నిలిచిన ఎర్రోళ్ల చింటులకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినోద్‌కుమార్, విజయ్, జగన్, రాంచందర్, సందీప్, కిట్టు, సురేశ్, బాల్‌రాజ్, నారాయణరెడ్డి, మహేశ్‌రెడ్డి, విగ్నేష్‌రెడ్డి, అనీల్, మల్లేశ్, సాయికిరణ్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, చిన్న, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, జనార్ధన్, సాయికుమార్‌గౌడ్, సందీప్‌రెడ్డి, విజయ్‌గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINICPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: SHADNAGAR
O.S.NO. 246 OF 2024

Between:
1. **SRI I.ASHOK KUMAR,** S/O Late Lakshimi Subba Rao Guptha Immadisetty, Age : 37 years, Occ : Software Engineer, (Aadhar NO. 2763 5508 2912) Represented by G.P.A Holder Sri I. Harshvardhan, S/o Late Lakshimi Subba Rao Guptha.
2. **SRI I.HARSHVARDHAN,** S/O Late Lakshimi Subba Rao Guptha Immadisetty, Age : 34 years, Occ : Software Engineer, (Aadhar NO. 3227 7807 6873) Plaintiff No. 1 and 2 R/o Flat NO.301, Vipras La Marvella, Pathrikanagar, Madhapur Village, Serilingampally(M), Ranga Reddy District, Telangana state ...Plaintiffs

And

1. **All Concerned.**
2. **The Tahsildhar,** Farooqnagar Mandal, Farooqnagar, Ranga Reddy District 509216 ...Defendants

SUMMONS TO DEFENDANTS

Whereas plaintiffs have filed above suit for declaring the plaintiffs herein as the only legal heirs of SMT LEELAVATHI IMMADISETTY, W/O LATE LAKSHIMI SUBBARAO GUPTHA IMMADISETTY in respect of suit schedule of property. If any person or persons have any objection on the above case, please appear before the Hon'ble court on 05-09-2024 at 10.30 am either in person or pleader, otherwise the suit will be determined in exparte

SCHEDULE OF PROPERTY

All that the Plot No. 25, admeasuring 200 Sq. yards in Survey No.218/U & 221/EE, situated at "VIJAYA VIHAR" NAGULAPALLY VILLAGE, Farooqnagar (M), R.R. District (Old Mahabub nagar District) bounded by **North**: Plot No.24, **South**: Plot No.26, **East**: 25' wide Road, **West**: Plot No.41.

(ORDER OF THE COURT)
Samudrala Srinivasa Rao, Advocate,
Counsel for the Plaintiffs

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

షాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని నాగర్‌గూడ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడ చైతన్య పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 34 మంది యువకులు రక్తదానం చేశారు. లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వినోద మొదటిసారి రక్తదానం చేశారు. 2003–2004 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 10 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు రాజశేఖర్, రాఘవేందర్ ముదిరాజ్, మేకల శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌చారి, వెంకట్‌స్వామి, తదితరులు ఉన్నారు.